సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబరుకు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

భక్తజన సంద్రం

- పోటెత్తిన అప్పికొండ, యారాడ తీరాలు
- పుణ్యస్నానాలు ఆచరించిన వేలాది మంది భక్తులు
- మార్మోగిన శివనామస్మరణ



అప్పికొండ తీరంలో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న అప్పికొండ సోమేశ్వర స్వామి

పెదగంట్యాడ : అప్పికొండ, యారాడ తీరం హోరెత్తింది. శివనామస్మరణతో మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకని బుధవారం రాత్రి జాగారం చేసిన భక్తులు గురువారం ఉదయం సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అప్పికొండ సోమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. అప్పికొండతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతోపాటు నగరం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో సముద్ర తీరం నిండిపోయింది. భక్తజన సంద్రంగా మారిపోయింది. ఈ సందర్భంగా భక్తులు తీరంలోని ఇసుక తిన్నెలపై శివలింగాలను రూపుదిద్ది పూజలు చేశారు. అంతేకాకుండా ఏటా ఇక్కడ శివరాత్రి రోజున జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయ ఈవో కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రంతా భక్తులు శివనామస్మరణ చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బీచ్ పెట్రోలింగ్‌తో భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. 100 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

పంచామృత అభిషేకం

జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాల చెరువులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో రామలింగేశ్వరుని సమేత పరమేశ్వరికి బుధవారం అర్ధరాత్రి పంచామృతాలతో అర్చకుడు వాసుదేవశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు నేరుగా భక్తులతో అభిషేకం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రంతా శివనామస్మరణ చేస్తూ జాగారం చేశారు.

అప్పికొండ భక్తులతో సందడి



సందడిగా మారిన కూర్మన్నపాలెం జంక్షన్



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న డీపీటీవో అప్పలనాయుడు

కూర్మన్నపాలెం : అప్పికొండ తీర్థయాత్రకు వెళ్లే భక్తులతో కూర్మన్నపాలెం బస్టాండ్‌లో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి సముద్ర స్నానాలకు వెళ్లే అనేక మంది గురువారం ఉదయమే అక్కడికి చేరుకోవడంతో కళకళలాడింది. బస్సులు ఎక్కి, దిగేవారితో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారిపోయింది. స్టీల్ సిటీ సిబ్బంది, యూనియన్ నాయకులు అక్కడికి చేరుకుని భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు సహకరించారు. మజ్జిగ శిబిరం ఏర్పాటు చేసి జిల్లా ప్రజారవాణాధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఆయనే స్వయంగా భక్తులకు మజ్జిగ, మంచినీరు అందించారు. సిబ్బంది, యూనియన్ నాయకుల సహకారం వల్లే స్టీల్ సిటీ డిపోకి ఈ ఏడాది ఊహించని ఆదాయం లభించిందని అసిస్టెంట్ మేనేజర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రాంతాలకు తమ డిపో నుంచి సుమారు 100 సర్వీసులు నడిపామని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి జి.సాయిరాం, నాయకులు చంద్రరావు పాల్గొన్నారు.



అప్పికొండలో ఏర్పాటు చేసిన దుకాణాలు



ఉమారామలింగేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు



అప్పికొండలో భక్తుల సందడి

కైలాసనాథుడి నిజరూప దర్శనం



అక్కిరెడ్డిపాలెం ఉమా రామలింగేశ్వరాలయంలో నిజరూపంలో దర్శనమిచ్చిన శివయ్య

అక్కిరెడ్డిపాలెం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం ఉమా రామలింగేశ్వరాలయంలో పరమశివుడు బుధవారం అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు నిజరూపంగా అవతరించాడు. రాత్రి జాగరణ చేసిన భక్తులు అర్ధరాత్రి ఆలయాలకు చేరుకుని నిజరూపంలో దర్శనం కల్పించిన కైలాసనాథుడిని దర్శించుకున్నారు. వెంటనే భక్తుల పుణ్యస్నానాలు ఆచరించి తిరిగి నిజరూపంలో ఉన్న పరమేశ్వరుని గురువారం వేకువజాము నుంచి దర్శించుకున్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ : మహా శివరాత్రిని పురస్కరించుకుని పాత అయ్యన్నపాలెం, శాతవాహన యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం ఆరు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. వారియర్స్ టీమ్ ప్రథమ స్థానంలో నిలవగా టైటాన్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. విజేతలకు గురువారం సాయంత్రం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గొందేశి నాగిరెడ్డి, ఆనంద్, అరుణ్, వెంకటరెడ్డి, శ్రీను, హరీష్, అజయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సనాతన ధర్మం అన్నిటికన్నా గొప్పది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గాజువాక : సనాతన ధర్మం అన్నిటికన్నా గొప్పదని, అందరూ పాటించాల్సిన బాధ్యత ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. స్థానిక శ్రీనగర్‌లో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో దివ్యప్రాణ ప్రతిష్ఠ, 108 కుండీల గాయత్రి మహాయజ్ఞం గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెరగాలన్నారు. గీతా పారాయణ, గాయత్రి మంత్రం, భగవద్గీత పఠనం మనిషిని మార్చుతాయన్నారు. భూమినే స్వర్గంగా భావించే పరివార్ సేవలు గొప్పవని కొనియాడారు. చేసిన సేవల్లోనే ఆత్మసంతృప్తి ఉంటుందన్నారు. జీవితంలో కొంత సమయాన్ని సేవకు ఉపయోగించాలన్నారు. ప్రతి ఒక్కరిలో ఒక కళ ఉంటుందని, అది కేవలం భారతీయుల్లోనే ఉంటుందన్నారు. నవ భారత నిర్మాణంలో యువత ప్రధాన భూమిక పోషించాలన్నారు. స్వామి వివేకానంద ఆలోచనా విధానాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డాక్టర్ చిన్నయ పెండ్యా, నిర్వాహకులు ధన్‌జీ భాయ్ పటేల్, అవతారం రాజు, జగదీష్ అశోపా, పర్వీన్‌భాయ్ పటేల్, రూపవేణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పెదగంట్యాడ : రామచంద్రనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 28న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఈపీడీసీఎల్ జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఫీడర్ పరిధిలోని వుడా కాలనీ ఫేజ్ – 2, రామచంద్ర నగర్, అమరావతి పార్క్, గాంధీనగర్, గోపాలరెడ్డి నగర్, పోర్టు రోడ్డు ఏరియా, జీవీఎంసీ డంపింగ్ యార్డ్ భరత్ నగర్, అమరావతి నగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చీటీల పేరుతో మోసం చేసిన మహిళపై కేసు

పెదగంట్యాడ : చీటీల పేరుతో మోసం చేసిన కేసులో ఓ మహిళను న్యూపోర్టు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నెల్లిముక్కు పరిధి గొందేశి వీధిలో నివసిస్తున్న అంధవరపు లక్ష్మి, మల్కాపురం రెడ్డి వీధిలో నివసిస్తున్న నూనెల లక్ష్మి అనే మహిళ వద్ద రూ.5 లక్షలు, రూ.3 లక్షల చీటీలు కట్టింది. చీటీల గడువు ముగిసిన తర్వాత తమ సొమ్ము ఇవ్వాలని బాధితురాలు కోరడంతో సదరు నూనెల లక్ష్మి అధిక వడ్డీ ఆశ చూపింది. కొన్నాళ్లు గడిచిన తర్వాత గత జనవరిలో తమ కుటుంబ అవసరాల నిమిత్తం తన సొమ్ము తనకు జమ చేయాలని కోరడంతో నూనెల లక్ష్మి, ఆమె భర్త మోహన్‌రావు చేతులెత్తేయడంతో బాధితురాలు న్యూపోర్టు పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసిన న్యూపోర్టు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అభ్యుదయ కళావేదిక ఆధ్వర్యంలో గానామృతం



పాట పాడుతున్న కళాకారిణి

ఉక్కునగరం: ఉక్కు అభ్యుదయ కళావేదిక ఆధ్వర్యంలో 'గానామృతం' సాంస్కృతిక కార్యక్రమం గురువారం నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ ఉక్కునగరంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివునిపై గీతాలు, అభ్యుదయ, పోరాట, చలనచిత్ర గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు వై.టి.దాస్ మాట్లాడుతూ కళాకారులు నిరంతరం తమ పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా కార్మికులను, ప్రజలను చైతన్యపరచాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. భీమలింగం, గణేష్ కీబోర్డు, కొర్లాం శ్రీనివాస్, నాగలింగం తబలా, కె.సింహాచలం డప్పు, కోటేశ్వరరావు ఫ్లూట్ వినిపించారు. జి.సత్యనారాయణ, నూకరాజు, సరోజిని, పార్థసారథి, గోవిందరాజు, శ్రీనివాసరావు, బ్రహ్మాజీ పాటలు ఆలపించారు. కార్యక్రమంలో కె.వి.రత్నం, కామేష్, గౌరీశంకర్, కె.సత్యనారాయణ, కృష్ణార్జున, టి.శ్రీనివాసులు, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

అగనంపూడి : అగనంపూడి వాకర్స్ క్లబ్ పర్యవేక్షణలో వాకింగ్ ట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి పది వరకు ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు అగనంపూడి వాకర్స్ క్లబ్ ప్రతినిధి మడుగల నరసింగరావు తెలిపారు. అపోలో ఆస్పత్రి సహకారంతో వైద్యులు డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ధీరజ్ పత్రి (అపోలో ఆస్పత్రి) సారథ్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా షుగర్, ఇతర వ్యాధులకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల్లోని వారు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ ఉద్యోగినికి సత్కారం



సత్కార సభలో హెచ్‌ఆర్ జీఎం భాను, ఇతర అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగానికి చెందిన అటెండెంట్ కంబాల అప్పలకొండను గురువారం సత్కరించారు. ఈ నెలాఖరున ఆమె పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా హెచ్‌ఆర్ విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో అప్పలకొండకు శాలువా కప్పి, పూలమాలతో అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు ఆమె సేవలను కొనియాడారు. బేబీ క్రెచ్‌లో సుదీర్ఘ కాలం సేవలు అందించి అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ ప్లాంట్ పర్సనల్ ఇన్‌చార్జి ఎస్.భాను, డీజీఎంలు డాక్టర్ రాధిక, వి.ఎల్.పి.లాల్, హెచ్‌ఆర్ అధికారులు జోగారావు, తిరుమలరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

విశేష అన్నసమారాధన



అన్నసమారాధనలో నాయకులు, కమిటీ సభ్యులు

అగనంపూడి : మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడక ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో గురువారం మధ్యాహ్నం విశేష అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అగనంపూడి పరిసర నిర్వాసిత కాలనీలు కొండయ్యవలస, పెదమడక, అట్టవానిపాలెం, కర్రివానిపాలెం, దానబోయినపాలెం, దిబ్బపాలెం, బీసీ కాలనీ, పినమడక, డొంకాడ, కొత్తూరు గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. నాయకులు ఇల్లపు ప్రసాద్, ఆలయ కమిటీ ప్రతినిధులు గెద్దాడ అప్పలరాజు, కొలిపాక అప్పారావు, కరణం సన్ని, లోవరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు విందుల సూర్య, సతీష్, దొడ్డి దేముడు, గుదే గజేంద్రరావు, అమరపిని సోమేష్, అప్పలరాజు, కొండలరావు, దానబాల పైడికొండ, కరణం శంకర్, బలిరెడ్డి సన్ని సేవలు అందించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- గాజువాక నియోజకవర్గంలో 87.76 శాతం ఓటింగ్
- మందకొడిగా ప్రారంభమై జోరందుకున్న ప్రక్రియ



గాజువాక హైస్కూల్‌లో ఓటర్లు



గాజువాక హైస్కూల్ వద్ద ఎస్‌ఐ రాధాకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు



నడుపూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

గాజువాక : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గాజువాకలో ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గంలోని గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రం, నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో 809 మంది ఓటర్లు ఉండగా, సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 710 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రశాంత వాతావరణంలో గాజువాక సెగ్మెంట్‌లో 87.76 శాతం ఓటింగ్ జరిగినట్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బారులుదీరారు. ఈ కేంద్రంలో 708 మంది ఓటర్లు ఓటు వేయాల్సి ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి 614 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 253 మంది కాగా, మహిళా ఓటర్లు 455 మంది ఉన్నారు. వారిలో 222 మంది పురుషులు, 392 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ మందకొడిగా ప్రారంభమై క్రమేపీ జోరందుకుంది. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ, గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి, గాజువాక సీఐ పార్థసారథి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఏఆర్వోలకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

నడుపూరు కేంద్రంలో ప్రశాంతం

పెదగంట్యాడ : టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 95 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్ కేంద్రంలో 101 ఓట్లకు 96 పోలయ్యాయి. 58 మంది ఉపాధ్యాయినులు, 38 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా న్యూపోర్టు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ బూత్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పెదగంట్యాడ మండల తహసీల్దార్ అమల పరిశీలించారు.

నిరుపయోగం

- శిథిలావస్థలో ఫార్మాసిటీ కల్యాణ మండపం
- పెత్తనంపై ఫార్మా కాలనీల మధ్య తేలని పంచాయతీ
- నిర్వహణ, ఆదరణ కరువై.. మందుబాబులకు అడ్డాగా మారిన వైనం

అగనంపూడి: పెత్తనంపై పితలాటకం.. లక్షల ప్రజాధనం వృథా.. ఎటూ తేలని పంచాయతీ.. వెరసి ఫార్మా నిర్వాసిత కాలనీ(ప్రియదర్శినినగర్)లోని కల్యాణ మండపం శిథిలావస్థకు చేరింది. దాని నిర్వహణ అక్కడున్న అన్ని కాలనీలకు చెందుతుందా లేక ఒక కాలనీకే చెందుతుందా అనే పంచాయతీ పీటముడి తేలకపోవడంతో లక్షల వ్యయంతో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కల్యాణ మండపం నిరుపయోగంగా మిగిలింది. రాత్రి వేళల్లో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది.

జీవీఎంసీ 85వ వార్డు గాజువాక మండలం, అగనంపూడి రెవెన్యూ పరిధిలో రెండు దశాబ్దాల క్రితం జేఎస్‌పీసీ నిర్వాసితులకు ఏపీఐఐసీ సారథ్యంలో లేఅవుట్లు వేసి పునరావాసం కల్పించారు. పలుమార్లు భూసేకరణ కారణంగా మూడు విడతల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి ఒక్కొక్కరికీ మూడు సెంట్ల స్థలాన్ని అప్పగించారు. ముందుగా లేమర్తి, అగ్రహారం, పి.బోనంగి, తరువాత కొత్తపాలెం, ఈదులపాక బోనంగి, ఏదూరివానిపాలెం, డొప్పవానిపాలెం గ్రామాలకు పునరావాసం కల్పించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రజా ప్రయోజనం కోసం కేటాయించిన స్థలాలు, వసతుల విషయంలో ఒకటి రెండు చోట్ల ఏకాభిప్రాయం లేకుండా పోయింది. రెండు చోట్ల ప్రాథమిక పాఠశాలలు, వేరే స్థలంలో హైస్కూల్‌కు స్థలం కేటాయించి వసతి నిర్మించారు. ప్రతీ గ్రామంలో వారి ఆరాధ్య దైవానికి గుళ్లు నిర్మించుకున్నారు.

ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. దశాబ్దంన్నర కిందట నిర్మించిన కల్యాణ మండపం లేమర్తిలో ఉండటం వల్ల ఆ గ్రామానికే చెందుతుందని భావించినా.. నిర్వహణ, కమిటీల విషయంలో ఫార్మాసిటీ కాలనీలందరికీ ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో అధికారులు లేమర్తి హైస్కూల్‌కు ఎదురుగా బోనంగిని ఆనుకొని మండపం నిర్మించారు. ఐతే వీటి నిర్వహణ, పెత్తనంపై పితలాటకం అక్కడే మొదలైంది.

ఏళ్లుగా నోచుకోని అభివృద్ధి..

ఫంక్షన్ హాల్ నిర్వహణ అన్ని కాలనీల పెద్దలతో కలిసి కమిటీ వేసుకోవాలనే ప్రతిపాదన వచ్చింది. కల్యాణ మండపం, ఇదే ఆవరణలోని రామాలయం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో నేటికీ ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోలేదు. లేమర్తి నాయకులు, వార్డు కార్పొరేటర్ చొరవ తీసుకొని కమిటీ ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేసుకుంటే అందరికీ ఉపయోగ పడుతుందనే భావన కాలనీలవాసులు వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంలో ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా వ్యవహరిస్తుండటంతో మండపం నిరుపయోగంగా మారి నిరాదరణతో శిథిలావస్థకు చేరిందని ఫార్మా నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. కల్యాణ మండపానికి మరమ్మతులు చేపడితే చిన్న చిన్న కార్యక్రమాలకు ఈ వేదిక సరిపోతుంది. లేమర్తి నాయకులు చొరవ తీసుకొని అన్ని కాలనీలను కలుపుకొని అందుబాటులో ఉన్న కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేసుకుంటే వివాహాలు కూడా చేసుకునే అవకాశం ఉందని, గ్రామంలో ఫంక్షన్ హాల్ పెట్టుకొని బయట లక్షల రూపాయలు వెచ్చించి కల్యాణ మండపాలకు వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ మండపాన్ని ఆధునికీకరించి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



ఫార్మాసిటీ కాలనీలో శిథిలావస్థకు చేరిన కల్యాణ మండపం

మండపం ఆధునికీకరణకు ప్రతిపాదనలు చేశాం



జీవీఎంసీ నిధులతో మరమ్మతులు చేపట్టి, ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు చేశాం. ప్రస్తుతం జీవీఎంసీలో ఆమోదం కోసం ఫైల్ సిద్ధంగా ఉంది. ఆమోదం తెలిపిన వెంటనే కల్యాణ మండపాన్ని ఆధునికీకరిస్తాం. తరువాత గ్రామ పెద్దలతో చర్చించి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసే విషయం కొలిక్కి తీసుకొస్తాం.

– ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, వార్డు కార్పొరేటర్

కమిటీ ఏర్పాటుతో నిర్వహణ, అభివృద్ధి

కాలనీల మధ్యలో కేటాయించిన విశాలమైన స్థలంలో అన్ని కాలనీలకు ఉపయోగపడేలా కల్యాణ మండపం నిర్మించారు. లేమర్తి, పానకాలయ్య బోనంగి పరిధిలో రామాలయం కట్టారు. వాటి నిర్వాహణ అప్పటి నుంచి అలాగే మధ్యలో నిలిపివేశారు. కల్యాణ మండపం, రామాలయ మండపం అభివృద్ధి విషయంలో ఏకాభిప్రాయంతో అన్ని కాలనీ పెద్దలతో కమిటీ వేసుకుంటే అభివృద్ధి చేసుకోడానికి బాగుంటుందని లేమర్తి కాలనీ వాసులకు చెప్పాం. వారు చొరవ తీసుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుంది.

– మంత్రి గిరిప్రసాద్, ఫార్మాసిటీ కాలనీ

